గులాబీ అధినేతకు

ఘనస్వాగతం

గులాబీ పార్టీ అధినేత కేసీఆర్‌కు బస్సు యాత్రకు నిజామాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఘన స్వాగతం పలికారు. మహిళలు పూలు చల్లుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జిల్లాలోకి ఆహ్వానించారు.

బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పక్కన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద పూలతో సిద్ధంగా ఉన్న మహిళలు

ముమ్మరంగా కొనసాగుతున్న ప్రచారం..

నిజాంసాగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, హాజరైన ప్రజలు

బీబీ పాటిల్ నిధులేమీ తేలె..

ఎల్లారెడ్డి, మే 6 : పదేండ్లు ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులేమీ తేలేదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. బీబీ పాటిల్ అధికారం అడ్డుపెట్టుకొని తన వ్యాపారాలు చేసుకుంటూ కోట్లు సంపాదించాడని, తనకు బీఆర్ఎస్ టికెట్ రాదని తెలిసి రాత్రికి రాత్రే పార్టీ మారి బీజేపీలో చేరాడన్నారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బాన్సువాడ రూరల్/బాన్సువాడ/బాన్సువాడ టౌన్/మాచారెడ్డి/ఎల్లారెడ్డి/గాంధారి/బీబీపేట్, మే 6 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. బాన్సువాడ పట్టణంలోని 10, 12వ వార్డుల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల మేలుకోరే బీఆర్ఎస్‌కు ప్రజల అండదండలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఇంకా కొందరికి సొంత ఇండ్లు లేనివారు ఉన్నారని, వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తే.. 75 గజాల స్థలంతోపాటు ఇండ్లను కూడా మంజూరు చేస్తానని పోచారం తెలిపారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శిలు లింగమేశ్వర్, ప్రతిమారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంతో పాటు బాన్సువాడ మండలంలోని బోర్లం, ఇబ్రహీంపేట్, దేశాయిపేట్, తాడ్కోల్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నెర్రె నర్సింహులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, శ్రావణ్‌కుమార్, నాయకులు నారాయణరెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, సాయిలుయాదవ్, రాజిరెడ్డి, విఠల్, పర్వంరెడ్డి, సయ్యద్ జలీల్, మన్నెచిన్న సాయిలు, సత్యం, రాజారాం, మన్నె రమేశ్, శేఖర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు. పాల్వంచ మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కూచని శేఖర్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నర్సింహులు, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలను వారు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిద్ధయ్య, నాయకులు సాయిలు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాంధారితోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధా బలరాం, ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, గండివేట్ మాజీ సర్పంచ్ అబ్దుల్ ఫారూక్, నాయకులు జింగురు సురేశ్, రొడ్డోళ్ల గంగాధర్, లక్ష్మణ్, పండిత్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

గాంధారిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి/మాచారెడ్డి, మే 6: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, మాచారెడ్డి మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం కోరారు. ఎల్లారెడ్డి, మాచారెడ్డిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం కామారెడ్డిలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఎల్లారెడ్డి, మాచారెడ్డి మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సతీశ్, నాయకుడు బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

కార్నర్ మీటింగ్‌కు తరలిరావాలి

రామారెడ్డి, మే 6: కామారెడ్డి పట్టణంలో నేడు నిర్వహించే కేసీఆర్ కార్నర్ మీటింగ్‌కు బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

కామారెడ్డి రూరల్, మే 6 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో నీటి సంపులో పడి మూడేండ్ల బాలుడు మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమల్లారెడ్డికి చెందిన దేవరాజు మూడేండ్ల కుమారుడు అన్విత్ సోమవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఇంటి ఎదుట బంతితో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో బంతి నీటి సంపులో పడింది. బంతి కోసం సంపులోకి వంగిన బాలుడు ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. వెంటనే బాలుడిని కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

నస్రుల్లాబాద్, మే 6 : బీర్కూర్‌కు చెందిన టేకు మహేశ్(30) మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన గ్రామంలోని కల్లు దుకాణంలో కల్లు తాగి వస్తానని ఇంటి నుంచి గ్రామంలోని బండగల్లీ వద్ద ఉన్న పాడుబడ్డ బావిలో పడి మృతి చెందాడని తెలిపారు. బావి వైపు వెళ్లిన పశువుల కాపరికి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

కామారెడ్డి, మే 6 : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఈ నెల 8వ తేదీలోగా వినియోగించుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో ఉండి ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగీ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని జిల్లాలోని ఆయా శాఖాధికారులకు సూచించారు. ఉద్యోగులకు కూడా ఎన్నికల సంఘం నుంచి వారి ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్ ఆధారంగా ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కామారెడ్డి ఆర్డీవో, మద్నూర్, ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయాల్లో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగుల కోసం ఎన్నికల సంఘం ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగిస్తున్న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కచ్చితంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం క్లోజ్ అయినా తర్వాత పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నందున ఈ నెల 13న జరిగే పోలింగ్ రోజు నేరుగా వెళ్లి ఓటు వేయడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. కామారెడ్డిలో 2,167, జుక్కల్‌లో 1,081, ఎల్లారెడ్డిలో 1,298 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

వాలీబాల్ వేసవి శిక్షణ కేంద్రం ప్రారంభం

వాలీబాల్ వేసవి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి, మే 6: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాంపూర్ గడ్డలో ఏర్పాటుచేసిన వాలీబాల్ వేసవి శిక్షణా కేంద్రాన్ని ఎస్సై ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ కేంద్రాన్ని యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్, బన్సీ, సల్మాన్, రాజు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో అంబలి కేంద్రం..

ఎల్లారెడ్డి, మే 6: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఏర్పాటుచేసిన అంబలి కేంద్రాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సోమవారం ప్రారంభించారు. 21 ఏండ్లుగా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉషాగౌడ్, నాయకులు సాయిబాబా, సామెల్, తిరుపతి, షెకావత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

అధ్వానం.. పారిశుద్ధ్యం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- పల్లెల ముఖం చూడని స్పెషల్ ఆఫీసర్లు
- మురికితో ఇబ్బంది పడుతున్న ప్రజలు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు

చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

పెద్ద కొడప్‌గల్, మే 6: పరిశుభ్రతకు నిలయాలుగా, ఆహ్లాదకర వాతావరణానికి మారుపేరుగా నిలువాల్సిన గ్రామాలు పారిశుద్ధ్య లోపంతో, సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోక, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పల్లెలు కంపుకొడుతున్నాయి. పెద్దకొడప్‌గల్ మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో మురికినీరు నిలిచి రోడ్డుపై పారుతున్నది. దుర్వాసన వస్తున్నదని, ఈగలు, దోమల బెడద పెరిగిందని ప్రజలు అంటున్నారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. దీంతో ప్రభుత్వం అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులు నియమించింది. కానీ వారు కూడా ఆయా గ్రామాల ముఖాన్ని చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు గ్రామాల్లో తాగునీటి, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఎల్లారెడ్డిలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసులు

మద్నూర్/ ఎల్లారెడ్డి రూరల్, మే 6: మద్నూర్ తహసీల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగుతున్నది. జుక్కల్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 8వ తేదీ వరకు జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎల్లారెడ్డిలో ఏర్పాటుచేసిన కేంద్రంలో డీఎస్పీ శ్రీనివాసులు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియెజకవర్గంలో 1203 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా.. సోమవారం సాయంత్రం వరకు 450 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు.

మద్నూర్‌లో ఓటు వేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా
పాస్‌పోర్ట్ పోయినది
★SALINLA DAS S/o SALINLA SAIANA, H.No.3-22/1. నల్లూర్. మం॥ముప్కాల్ నా యొక్క పాస్‌పోర్ట్ నెం. H3205341. ముప్కాల్ నుండి నల్లూర్‌కు ఆటోలో వస్తుండగా పోయినది. దొరికినవారు Pls Call: 9849825836
NTZ-324801
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొండాపూర్‌లో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట్, మే 6 : మండలం కొండాపూర్ గ్రామంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.3,180 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొండాపూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణాధికారిణి మౌనిక అన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ ఏఈవో మౌనిక, ఆర్గొండ సొసైటీ సీఈవో సాయిలు, రైతులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో

సబ్‌సెంటర్ పరిశీలన

డోంగ్లీ, మే 6: మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌ను వైద్యాధికారిణి శ్రీలేఖ సోమవారం పరిశీలించారు. గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. అవుట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మంగళవారం నిర్వహించే 'ఆరోగ్య మహిళ'లో మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఏఎన్ఎం శోభ తదితరులు ఉన్నారు.

రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారిణి శ్రీలేఖ

వాహనం చోరీ

బాన్సువాడ, మే 6: బాన్సువాడ పట్టణం సంగమేశ్వర్ కాలనీలో సీమల సాయిలు ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన తుపాన్ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు సీఐ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి రీత్యా డ్రైవర్ అయిన సాయిలు ఈ నెల 5న ఎప్పటిలాగే తుపాన్ వాహనాన్ని ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. సోమవారం ఉదయం చూడగా వాహనం కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని దొంగిలించారని సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓటరు స్లిప్పులను పంపిణీ చేశాం..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 6: త్వరలో నిర్వహించనున్న ఎన్నికల సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో గ్రామాల్లో ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటు ఏ పోలింగ్ స్టేషన్‌లో ఉన్నది..? పోలింగ్ స్టేషన్ ఎక్కడ..? క్రమ సంఖ్య, పోలింగ్ తేదీ, సమయం వివరాలు స్పష్టంగా స్లిప్పులో ఉన్నాయని తెలిపారు. ఓటరు స్లిప్పుతోపాటు ఓటరు గైడ్, సీ విజిల్ కరపత్రాన్ని ప్రతి ఇంటికీ అందజేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులను సీ విజిల్ యాప్‌లో చేయవచ్చని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వచ్ఛందంగా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునే విధంగా జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పోలింగ్ రోజు సెలవు ఉన్నదని ఎక్కడికీ వెళ్లకుండా తప్పకుండా ఓటును బాధ్యతతో వేయాలని సూచించారు. కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటరు ఎపిక్ కార్డు, ఆధార్, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, పోస్టాఫీస్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, జాతీయ జనాభా రిజిస్టర్ జారీ చేసిన స్మార్ట్ కార్డ్, భారత పాస్ పోర్ట్, ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం, ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, చట్ట సభల్లో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తమవెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఎన్నికల సంఘం పొడిగించిందని, ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు.